క్లుప్తంగా

నేడు 'ఆనందో బ్రహ్మ' కామెడీ షో

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో ఆదివారం సాయంత్రం మొగలి ఎంటర్‌టైన్‌మెంట్స్ ఆధ్వర్యాన 'ఆనందో బ్రహ్మ'పేరిట కామెడీ షో నిర్వహిస్తున్నట్లు సంస్థ అధినేత మొగిలి గుణకర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రముఖ సంస్థల్లో షోలు ప్రదర్శించిన కళాకారులు, వివిధ రాష్ట్రాల కమెడియన్లు పాల్గొంటారని వెల్లడించారు. జిల్లావాసులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నామవరపు కాంతేశ్వరరావు, విద్యాసాగర్, నాగసాయి తదితరులు పాల్గొన్నారు.

కుల నిర్మూలనకు కృషి

కామేపల్లి: జ్యోతిరావు పూలే స్ఫూర్తితో కుల నిర్మూలనకు కృషి చేద్దామని ప్రగతిశీల యువజన సంఘం పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌పీ రాకేష్ అన్నారు. శనివారం మండలంలోని పండితాపురంలో మండల సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యాన నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలకులు కులాలు, మతాలను ప్రోత్సహించి అధికారాన్ని కాపాడుకుంటున్నారే తప్ప నిజమైన ప్రజాసమస్యలను పరిష్కరించలేకపోతున్నారని విమర్శించారు. నాయకులు చల్లా రాజు, వడ్డే వెంకటేశ్వర్లు, మాధవి లత, చల్లా ప్రమీల, సుశీల, శారద తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ వితరణ



కంప్యూటర్ అందజేస్తున్న కుటుంబీకులు

రఘునాథపాలెం: మండలంలోని పాపటపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయానికి దివంగత కొనకంచి వెంకటప్పయ్య జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు రూ.36వేల విలువైన కంప్యూటర్‌ను వితరణగా అందజేశారు. శనివారం పంచాయతీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కుటుంబసభ్యులు బొడ్లపాటి సత్యనారాయణ, రమాదేవి, వంశీలు కంప్యూటర్, స్కానర్, ప్రింటర్, జిరాక్స్ వంటి పరికరాలను కార్యదర్శి నాగరాజుకు అందించారు. కొనకంచి రామచంద్రయ్య, చావా రామయ్య, నాగండ్ల భద్రయ్య, దుంపటి నగేష్, డాక్టర్ బాబు, చెన్నబోయిన సైదులు, కొనకంచి వెంకటేశ్వర్లు, వెంకటనారాయణ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



బ్యూటీషియన్ శిక్షణ పొందుతున్న మహిళలు..



ఫ్యాషన్ డిజైనింగ్‌లో..

ఉపాధి మార్గాలు!

చదువుతో భేదం లేకుండా మహిళలకు ఆర్థిక స్వావలంబన దిశగా స్వయం ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న 'వృత్తి నైపుణ్యం' కోర్సులకు పెద్ద ఎత్తున్న ఆదరణ లభిస్తోంది. గ్రామీణ, పట్టణ తేడా లేకుండా తమ కుటుంబానికి ఆదరువుగా నిలబడాలని శిక్షణ వైపు అడుగులు వేస్తున్నారు. ఈనేపథ్యాన మూడు నెలల పాటు పలు వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ పొందేందుకు ఆసక్తి కనబరుస్తుండగా.. 'వృత్తి నైపుణ్యం' వారికి ఒక వరంలా మారింది. – ఖమ్మం రాపర్తినగర్



కంప్యూటర్ కోర్సులో శిక్షణ పొందుతున్న అభ్యర్థులు

మహిళలకు వరంలా 'వృత్తి నైపుణ్యం'

- ప్రతి ఏటా నాలుగు బ్యాచ్‌లు
- మూడు నెలలపాటు ప్రత్యేక శిక్షణ
- మహిళల నుంచి పెరుగుతున్న ఆదరణ

సండే స్పెషల్

ప్రభుత్వ గుర్తింపు ఉండడంతో..

నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న వృత్తి నైపుణ్యం కోర్సుల్లో మహిళలు అధికంగా చేరుతున్నారు. వీరికోసం ప్రత్యేకంగా ఫ్యాషన్ డిజైనింగ్, కంప్యూటర్ శిక్షణ, బ్యూటీషియన్ వంటి కోర్సుల్లో శిక్షణ ఇస్తూ వారిలో ఆత్మ విశ్వాసాన్ని నింపుతున్నారు. దీనికి ప్రభుత్వ గుర్తింపు ఉండడంతో పలు ప్రైవేట్ రంగాల కంపెనీలు ఇందులో శిక్షణ పొందిన వారిపై ఆసక్తిని చూపుతున్నాయి. ఉపాధి అవకాశాలు కూడా మెండుగా ఉండడంతో ఆయా కోర్సుల్లో తర్ఫీదునిస్తూ జిల్లా యువజన శాఖ అధికారులు పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు.

శిక్షణ శిబిరానికి క్యూ..

అయితే ఇందులో ప్రత్యేక కోర్సుల్లో శిక్షణ ఇచ్చేందుకు సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకున్నారు. వారికి వీలైనంత త్వరలో ఉపాధి కల్పించే బాధ్యత కాకపోయిన ప్రత్యేక చొరవతో మహిళలకు ఆయా రంగాల్లో మెళకువలు నేర్పుతుండడంతో ఇష్టంగా నేర్చుకుంటున్నారు. దీంతో నగరంలోని మహిళలతో పాటు గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారు శిక్షణ శిబిరానికి క్యూ కడుతున్నారు.

శిక్షణతో పాటు సర్టిఫికెట్లు..



ఉపాధి రంగంలో మహిళలకు మూడు కోర్సుల్లో శిక్షణ ఇవ్వడంతో పాటు ప్రత్యేక గుర్తింపునిచ్చేలా సర్టిఫికెట్లు అందిస్తున్నాం. వీటి ద్వారా నేరుగా ఉపాధి పొందేందుకు అవకాశం ఉంటుంది. ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, కంప్యూటర్ శిక్షణకు మహిళలు అధికంగా తరలివస్తున్నారు. ప్రతీ అభ్యర్థికి శిక్షణ మెళకువలను నేర్పుతున్నాం.
– టి.సునీల్‌రెడ్డి, డీవైఎస్‌ఓ

ఇష్టంగా నేర్చుకుంటున్నారు..



బ్యూటీషియన్ కోర్సు కష్టమైనప్పటికీ మహిళలు ఇష్టంగా నేర్చుకుంటున్నారు. వివిధ ఫంక్షన్లలో పెళ్లి కూతురితో పాటు ఇతర మహిళలను అందంగా తీర్చిదిద్దడమే కాకుండా ముందున్న రూపాన్ని మర్చిపోయేలా చేస్తూ ఉపాధి పొందుతున్నారు. ఇంటి వద్దే ఖాళీగా ఉండే కన్న ఇలాంటి కోర్సుల్లో అత్యధికంగా మహిళలు నేర్చుకుంటున్నారు.
– ఆర్. శైలజ, బ్యూటీషియన్ శిక్షకురాలు

కంప్యూటర్ రంగంపై ఆసక్తి



కంప్యూటర్ రంగంపై మహిళలు ఎక్కువ ఆసక్తి కనబరుస్తున్నారు. నెట్ సెంటర్లు, ఫ్లెక్సీ షాపులు, హోటళ్లలో కంప్యూటర్ బిల్లింగ్ చేసేందుకు ప్రైవేట్ యాజమాన్యాలు వృత్తి నైపుణ్యం శిక్షణ పొందిన వారినే తీసుకుంటున్నారు. అంతేగాక డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లోనూ ఉపాధి లభిస్తుంది.
– కె.చందన, కంప్యూటర్ శిక్షకురాలు

మార్పులకు అనుగుణంగా..



ఫ్యాషన్ డిజైనింగ్‌లో వస్తున్న మార్పులకు అనుగుణంగా శిక్షణ కొనసాగుతుంది. ప్రతీ మహిళ ఓపికగా నేర్చుకుని కొత్తకొత్త డిజైన్లలో శాంపిళ్లు కుట్టి చూపించడం గర్వనీయంగా ఉంది. తమ దగ్గర శిక్షణ పొందిన వారికి ఉపాధి గ్యారంటీ అనే నినాదంతో శిక్షణ ఇస్తున్నాం. అభ్యర్థులు మూడు నెలలపాటు శిక్షణ ఇస్తున్నా తమకు తృప్తినిస్తుంది.
– అంబికా, ఫ్యాషన్ డిజైనర్

కొనసాగుతున్న నవరాత్రోత్సవాలు

దసరా పండుగను పురస్కరించుకుని శ్రీదేవీ నవరాత్రోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా దుర్గాదేవి అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమివ్వగా.. సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేయగా.. పలుచోట్ల పూజా సామగ్రి అందజేశారు. – సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంగాంధీచౌక్: జమ్మిబండపై అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



తిరుమలాయపాలెం: జూపెడలో కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు



ఖమ్మం పంపింగ్‌వెల్ రోడ్డులో అన్నదానం



ఖమ్మంవైరారోడ్: 18వ డివిజన్ సీతారామనగర్‌లో..

శ్రీ గాయత్రీ దేవిగా మారెమ్మతల్లి



ఖమ్మంరూరల్ : మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో కొలువుదీరిన శ్రీ మారెమ్మతల్లి ఆలయంలో శనివారం అమ్మవారు శ్రీ గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా చండీహోమం, కుంకుమార్చన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఈఓ కె.జగన్‌మోహన్‌రావు, ప్రధానార్చకులు కాశావజ్జుల రామశర్మతో పాటు ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఖమ్మంఅర్బన్: కొత్తగూడెంలో దాతలు అందించిన పూజా సామగ్రితో భక్తుల పూజలు



ఖమ్మం సారథినగర్‌లో..

ఎంపీపీ ఓసీ.. జెడ్పీటీసీ బీసీ...

రఘునాథపాలెం: స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి రిజర్వేషన్లను అధికారులు శనివారం ఖరారు చేశారు. మండల పరిధిలో ఎంపీపీ స్థానాన్ని ఓసీకి, జెడ్పీటీసీ స్థానాన్ని బీసీకి కేటాయించారు. 2013, 2019లో జరిగిన ఎన్నికల్లో మండలానికి ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలు ఎస్టీ వర్గానికి కేటాయించగా.. ఈసారి ఒక్కటి కూడా ఎస్టీకి దక్కకపోవడంతో గిరిజనుల మండలాల్లో అసంతృప్తి నెలకొంది. గ్రామపంచాయతీ స్థాయిలోనూ రిజర్వేషన్లు అధికారికంగా ప్రకటించనప్పటికీ అనధికారికంగా చెబుతున్న జాబితాల ప్రకారం కొన్ని గ్రామాల్లో ఒకటి, రెండు కుటుంబాలే ఉన్న వర్గాలకు రిజర్వేషన్ కేటాయించారు. గిరిజన జనాభా అధికంగా ఉన్న గ్రామాల్లో బీసీలకు రిజర్వేషన్ ఇవ్వడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సన్నాహక సమావేశం

మండలంలోని చింతగుర్తి, గణేశ్వరం గ్రామాల్లో స్థానిక సంస్థల సన్నాహక సమావేశాలు శనివారం నిర్వహించగా.. నగర మేయర్ పునుకొల్లు నీరజ, మున్సిపల్ కార్పొరేటర్లు, నాయకులు మందడపు మనోహర్‌రావు, హనుమంతరావు హాజరై గ్రామాల అభివృద్ధి, స్థానిక సమస్యలపై చర్చించారు. పార్టీ అధిష్టానం మేరకు అభ్యర్థులను ఎవరిని నియమిస్తే వారినే ఏకగ్రీవంగా అత్యధిక మెజార్టీలో గెలిపించుకోవాలని సూచించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్గదర్శకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి మార్గదర్శకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని శనివారం వివిధ సంఘాలు, రాజకీయ పార్టీల ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ప్రజాస్వామ్య విలువలకు అంకితభావంతో సేవలందించిన ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. – సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంవైరారోడ్: బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న నాయకులు



ఖమ్మం మామిళ్లగూడెం: ట్యాంక్‌బండ్ వద్ద జిల్లా అభ్యుదయ పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

భగత్‌సింగ్ స్ఫూర్తితో పోరాటాలు

విద్య, ఉద్యోగం, ఉపాధి కోసం యువత భగత్‌సింగ్ స్ఫూర్తితో పోరాటాలు చేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. శనివారం భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకుని డీవైఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన భగత్‌సింగ్ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేటి సమాజంలో యువత మత్తుకు బానిసై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకుని సన్మార్గంలో పయనించాలని కోరారు. – సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంమామిళ్లగూడెం: బీసీ స్టడీ సర్కిల్‌లో నివాళులర్పిస్తున్న డీవైఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు



ఖమ్మంరూరల్: కామంచికల్‌లో నివాళులర్పిస్తున్న డీవైఎఫ్‌ఐ నాయకులు

పట్టణాలను విస్మరిస్తున్న ప్రభుత్వం

ఖమ్మంమయూరిసెంటర్: ప్రస్తుత నగరాల సమస్యలను విస్మరించి ఫ్యూచర్ సిటీలను నిర్మించడం వల్ల పేద ప్రజలకు ఏమి ఉపయోగమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నగరంలోని త్రీటౌన్ ప్రాంత సమస్యలు పరిష్కరించి అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతూ సీపీఎం ఖమ్మం త్రీ టౌన్ కమిటీ ఆధ్వర్యాన శనివారం స్థానిక బోస్ సెంటర్ నుంచి కాల్వొడ్డు సెంటర్ వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ పాదయాత్రకు ఆయన జెండా ఊపి ప్రారంభించి 31వ డివిజన్ కార్పొరేటర్ యర్రా గోపి అధ్యక్షతన జరిగిన సభలో మాట్లాడుతూ.. రాష్ట్ర సీఎం రాష్ట్రాభివృద్ధిపై గొప్పలు చెబుతున్నారే గాని ఆచరణలో అమలు కావడం లేదన్నారు. ఆతర్వాత సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరావు మాట్లాడుతూ.. త్రీటౌన్‌లో ఇప్పటివరకు మినీ స్టేడియం, ప్రభుత్వ ఆస్పత్రి లేవని, రోడ్లు కంకర తేలి, డ్రేయినేజీలు కంపుకొడుతున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్, పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు యర్రా శ్రీనివాసరావు, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బండారు రమేష్, నందిపాటి మనోహర్, మెరుగు సత్యనారాయణ, త్రీటౌన్ కార్యదర్శి భూక్యా శ్రీనివాస్‌రావు, డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు వజినేపల్లి శ్రీనివాస్‌రావు, పత్తిపాక నాగ సులోచన, బండారు యాకయ్య, కార్పొరేటర్ యల్లంపల్లి వెంకట్రావు, త్రీటౌన్ కార్యదర్శి వర్గ సభ్యులు బండారు వీరబాబు, యర్రా రంజిత్, ఎస్‌కె.ఖాసీం, ఎస్‌కె.అమీనా, మీనాల మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్రను ప్రారంభిస్తున్న పోతినేని సుదర్శన్‌రావు

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



కల్యాణలక్ష్మి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

కామేపల్లి: రాష్ట్రంలోని పేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టిందని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో కల్యాణలక్ష్మి పథకం లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను అందించారు. అనంతరం ముచ్చర్లలో ఇసుక విక్రయకేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం తక్కువ ధరకు ఇసుక అందేలా విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.ఇళ్ల నిర్మాణంలో జాప్యం జరుగకుండా ఎంపీడీఓలు,గృహ నిర్మాణశాఖ అధికారులు పర్యవేక్షణ చేయాలని సూచించారు.అదే విధంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ పెంపుపై హర్షం వ్యక్తం చేస్తూ మండల బీసీ నాయకులతో కలిసి కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గింజల నర్సింహారెడ్డి, కామేపల్లి పీఏసీఎస్ చైర్మన్ పుచ్చకాయల వీరభద్రం, డీసీసీడీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్, ధరావత్ అనురాధ, కొమ్మినేని శ్రీనివాసరావు, మాలోత్ సరిరాంనాయక్, ఇట్టా శ్రీను, దొడ్డ వేణు, బొడ్డు లక్ష్మీనారాయణ, చల్లా హరి, జర్పుల బాల తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ఖమ్మంమయూరిసెంటర్: తిరుమలాయపాలెం మండలానికి చెందిన లబ్ధిదారులకు శనివారం మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో నాయకులు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. మొత్తం 80 మందికి గాను రూ.25.33 లక్షల చెక్కులు పంపిణీ చేశారు. పాలేరు నియోజకవర్గంలో మంత్రి పొంగులేటి చొరవతో లబ్ధిదారులకు త్వరగా చెక్కులు అందుతున్నాయని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాలేరు నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివ రామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బెల్లం శ్రీను, మాజీ ఎంపీపీలు కొప్పుల అశోక్, బోడ మంగీలాల్, అరవింద్‌రెడ్డి, ఉన్నం రాజశేఖర్‌లతో పాటు గుర్రాల శ్రీనివాసరెడ్డి, నగేష్, కిరణ్, అంబేడ్కర్, వెంకట్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

కేఎంసీ ఎదుట సీపీఎం ధర్నా



ధర్నా చేస్తున్న నాయకులు, బాధితులు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని రేవతి సెంటర్‌లో గత 60 ఏళ్లుగా నివాసం ఉంటున్న వారిని ఖాళీ చేయాలని ఇచ్చిన నోటీసులను వెంటనే వెనక్కి తీసుకోవాలని సీపీఎం డివిజన్ సెక్రటరీ వై.విక్రమ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు క్వార్టర్స్ బాధితులు శనివారం సీపీఎం నాయకులతో కలిసి ఖమ్మం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆనాడు 60 ఏళ్ల క్రితం టౌన్‌లో ప్రభుత్వ బిల్డింగ్‌లు కట్టడానికి వచ్చిన దళిత పారిశుద్ధ్య కార్మికులకు నివాసం ఉండటానికి మున్సిపల్ క్వార్టర్లు కట్టారని తెలిపారు. మాజీ మున్సిపల్ చైర్మన్ సమీనా అఫ్రోజ్ చొరవతో ఈ క్వార్టర్లను నమ్ముకుని ఉన్న దళిత మున్సిపల్ ఉద్యోగులకు ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆనాడు పాలకవర్గం తీర్మానం చేసిందన్నారు. నాటి నుంచి వాటిని మరమ్మతులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగులకు, క్వార్టర్స్‌లో ఉంటున్న వారికి ఈ క్వార్టర్లు అప్పగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బోడపట్ల సుదర్శన్, ఎస్‌కె.నాగులుమీరా, సీహెచ్.భద్రం, జె.వెంకన్నబాబు, మల్లికార్జున్ రెడ్డి, గుమ్మడి భిక్షం తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న కళాసిల్క్

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని టీటీడీ కళ్యాణ మండపంలో హైదరాబాద్‌కు చెందిన కళా సిల్క్ చేనేత హస్త కళా చేనేత వస్తు ప్రదర్శన మహిళలను ఆకట్టుకుంటోంది. మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, కాంతావర్క్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెండ్ శారీస్, లెనిన్ శారీస్, కళ బెంగాల్ కాటన్, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ జాకెట్లు, లక్నో చికాన్ శారీస్, ఖాదీ మెటీరియల్, వన్ గ్రామ్ గోల్డ్ జ్యూయలరీ వంటివి ప్రదర్శించి వినియోగదారులకు విక్రయిస్తున్నట్లు నిర్వాహకుడు వినోద్ జైన్ తెలిపారు.

వైద్య శిబిరం విజయవంతం



మందులు అందిస్తున్న నిర్వాహకులు

కూసుమంచి: మండలంలోని ఎర్రగడ్డతండాలో సంస్కృతి ట్రస్ట్ ఆధ్వర్యాన శనివారం నిర్వహించిన మెగా వైద్య శిబిరం విజయవంతమైంది. తండాకు చెందిన బాణోత్ సోమ్లానాయక్ సతీమణి బుచ్చమ్మ జ్ఞాపకార్థం నిర్వహించిన ఈ శిబిరంలో పలువురు వైద్యులు పాల్గొని పేషంట్లను పరీక్షించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌ఎన్ లేబరేటరీకి చెందిన షేక్ ఖాజా, శ్రీనివాస్, పవన్, నర్సింహారావు, సత్య, నందన్, శ్రీనాథ్, శ్రీకాంత్‌తో పాటు క్యాంపు నిర్వాహకులు హటియా నాయక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టీ.టీ. కోర్టు పరిశీలన

ఖమ్మం స్పోర్ట్స్: నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో నిర్మాణం పూర్తయిన టేబుల్ టెన్నిస్ కోర్టులను త్వరలో ప్రారంభిస్తున్నట్లు కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య పేర్కొన్నారు. శనివారం టేబుల్ టెన్నిస్ హాల్‌ను సందర్శించి ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే మూడు టీ.టీ. కోర్టులను నిర్మించామని, వీటిని త్వరలో ఖమ్మంలో జరిగే రాష్ట్రస్థాయి టీ.టీ పోటీల లోపు ప్రారంభిస్తామన్నారు. డీవైఎస్‌ఓ టి.సునీల్‌రెడ్డి, అథ్లెటిక్స్ కోచ్ ఎం.డీ.గౌస్, టీ.టీ. సంఘం జిల్లా అధ్యక్షుడు బాలసాని విజయ్, కార్యదర్శి వీవీఎస్‌మూర్తి పాల్గొన్నారు.

అందుబాటులోకి గ్యాస్ దహన వేదిక

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని కాల్వొడ్డు హిందూ శ్మశానవాటిలో గ్యాస్ దహన వేదికను పునఃప్రారంభించారు. ఇది 2014లో ప్రారంభం కాగా గతేడాది వచ్చిన వరదల్లో దెబ్బతిని నిరుపయోగంగా మారగా.. హిందూ శ్మశాన వాటికల నిర్వహణ కమిటీ ఆధ్వర్యాన తిరిగి వినియోగంలోకి తీసుకొచ్చారు. దహన సంస్కారాలను నిరుపేదలకు ఉచితంగా, ఇతరులకు రూ.3,500లకు నిర్వహించనున్నట్లు నిర్వహణ కమిటీ కార్యదర్శి ఆర్‌వీ.పద్మానాభం ఒక ప్రకటనలో వెల్లడించారు. మరిన్ని వివరాలకు 93971 91919 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

నేత్రదానం

ఖమ్మంవైద్యవిభాగం: నగరంలోని సీతారామనగర్ ప్రాంతానికి చెందిన గుర్రం ఇందిర మృతి చెందగా.. ఆమె నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేసినట్లు ఖమ్మం నేత్రనిధి కార్యదర్శి ఆర్.అనంత పద్మనాభం తెలిపారు. ఆమె పార్థివదేహాన్ని కాల్వొడ్డు హిందూశ్మశానవాటిలో దహన సంస్కారాలు చేశామన్నారు.

వైభవంగా వేపకాయల బతుకమ్మ

బతుకమ్మ పండగను పురస్కరించుకుని ఏడో రోజు శనివారం వేపకాయల బతుకమ్మ వేడుకలను మహిళలు వైభవంగా జరుపుకున్నారు. తీరొక్క పూలతో తయారు చేసిన బతుకమ్మలను ఓ చోట పేర్చి పూజలు చేశాక ఆటపాటలతో సందడి చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాలయాలు, కార్యాలయాల్లోనూ వేడుకలు నిర్వహించి వాగులు, చెరువుల్లో నిమజ్జనం చేశారు. – సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంగాంధీచౌక్: విజయనగర్ కాలనీ మైదారంలో పూజలు చేస్తున్న మహిళలు



ఖమ్మంవ్యవసాయం: అటవీ కార్యాలయంలో.. జిల్లా అటవీ అధికారి సిద్దార్థ విక్రమ్ సింగ్ పూజలు



ఖమ్మం మామిళ్లగూడెం: బీకే బజార్‌లో వీరనారీమణుల ఆశయ సాధన సమితి ఆధ్వర్యంలో..



ఖమ్మంగాంధీచౌక్: విజయ్‌నగర్ కాలనీ వేడుకలో పాల్గొన్న మహిళలు, చిన్నారులు



ఖమ్మంరూరల్: శ్రీచైతన్యలో ఇంజనీరింగ్ కళాశాలలో బతుకమ్మలతో యాజమాన్యం